# పరాజితుడు

రచన:
శ్రీ ఎ. ఎస్. రా[illegible]

'హుం! ఈ దెబ్బతో మనం ఈ వృత్తికి స్వస్తివాచకం చెప్పుకోవచ్చు' అనుకున్నాడతను.

సానచక్రం కాంతివేగాన్ని మించి పరిభ్రమిస్తోంది. చక్రానికి రాపిడి కలిగిస్తూ కత్తెరను పదును చేస్తున్నాడు. ఈ రెంటికీ మధ్య జరుగుతున్న సంఘర్షణలో పుడుతున్న నిప్పు రవ్వలు గజందూరందాకా చిమ్ముతున్నాయి.

అర్ధరాత్రి. ప్రపంచమంతా మైమరచి నిద్రిస్తోంది. చీమ చిటుక్కుమన్న శబ్దంకూడా వినరావటంలేదు మానవాళి మనస్సులలో రేగిన 'రేపటి సంగతేలా?' అన్న సమస్యలు ఆలోచన రూపంలో ఆ నిశీధిలో స్వేచ్ఛగా విహరిస్తున్నాయి.

ప్రపంచమంతా నిద్రిస్తున్నా, అతను మేలుకొనే వున్నాడు. అతనొక్కడు ఆ చీకటి గదిలో కత్తెరను పదును చేస్తున్నాడు. అతని కాళ్ళూ, చేతులు కలిసే పని చేస్తున్నాయి. నిప్పురవ్వల వెలుగులో అలసిన అతని ముఖంమీద స్వేదకణాలు ముత్యాల్లా మెరుస్తున్నాయి. కత్తెర సానపడుతున్నప్పుడు అతనిముఖంలో ఈర్ష్య, అసూయ, కోపం మొదలైనవి అతి భయంకరంగా కనిపిస్తున్నాయి. కత్తెర పదును పరిశీలిస్తున్నపుడు అతనిలో ఒక విధమైన తృప్తి, ఆనందం కలుగుతున్నాయి. ఆ సమయంలో అతని పెదవులపై చిరునవ్వులు తాండవిస్తున్నాయి. వెనువెంటనే అతనిమనస్సులోనికి ఏవో భయంకరమైన ఆలోచనలు వస్తున్నాయి. అతని ముఖం భయంతో, అవమానంతో నల్లబడిపోయింది. గుండెకాయ వేగంగా కొట్టుకుంది. శరీరం కంపిస్తోంది.

తిరిగి ధైర్యాన్ని తెచ్చుకుంటున్నాడు. 'హుం! అనుకుంటూ మీసంమీదికి చేయిపోనిస్తున్నాడు. మధ్యమధ్య ముఖంమీద చెమటను తుడుచుకుంటున్నాడు. కత్తెర పదును తీక్షణంగా చూస్తున్నాడు. అంతటి చీకటిలో పదును పెట్టిన కత్తెర వజ్రాయుధంలా తళతళ మెరుస్తోంది. ఆ గదికొక క్రొత్త వెలుగును ప్రసాదిస్తోంది.

'వజ్రాయుధం' అనుకున్నాడు మెల్లగా తనలో.

నిజానికి ఆ కత్తెర అతనికి వజ్రాయుధమే. అప్పుడు ఇంద్రుడు తన వజ్రాయుధంతో పెద్దపెద్దకొండలకివున్న రెక్కల్ని సఫా చేశాడు. ఈ నాడు ఐశ్వర్యంతో మదమెక్కి కొండెక్కికూర్చున్నవాళ్ల జేబుల్ని సఫా చేస్తున్నాడు. అంతే తేడా!

అందుచేత అతనూ ఒక ఇంద్రుడే. 'ఆ లోకంలో అతన్ని కనిపెట్టుకుంటూ ముప్పైమూడుకోట్ల దేవతలు. రంభ, ఊర్వశి మొదలైన అప్సరసలు వుండేవాళ్లట. నవరత్న ఖచిత సింహాసనంమీద, శచీదేవిని అంకపీఠం మీద అలంకరించుకుని, మత్తెక్కించే పానీయాలు సేవిస్తూ, ఆ నిషాలో అప్సరసల నాట్యాల్ని తిలకిస్తూ వుంటే...అబ్బ! ఏం మజాగా వుంటుంది! చూడాలే కాని, చెప్ప శక్యంకాదు' అని పార్కులో కథలు చెప్పే గురూజీ మాటలు అతనివిషయంలో అక్షరాలా నిజం.

♦ ♦ ♦

అతణ్ణి కనిపెట్టుకుని ఎంతమందిలేరు? అదే - ఆ వీధిలోనే అతని ఇంద్రలోకం. ఆ కామాక్షే అతని శచి. అతను వెళ్ళేసరికి ఎంత ఆనందిస్తుందని. గుమ్మంలో అడుగుపెట్టేసరికి. చిరునవ్వులతో, మందగమనంతో, మయూరంలా నడిచివచ్చి మెడనుపట్టి చుట్టేస్తుంది. అదే అతనికి కావల్సింది, అందుకనే ఆమెకోసం ఏ పనైనా అతను ప్రాణాలను తెగించికూడా చేయగలడు. కామాక్షి కంటె అందంగావుంటుందా శచి? అంతా పుస్తకాల్లో చదువుకున్న వాళ్ళేకాని, ఒక్కడైనా కళ్లారా చూశాడా అని?

అప్పుడే యవ్వనంలో అడుగుపెట్టిన అందాలరాశి - కామాక్షి చెల్లెలు మీనాక్షి-గజ్జలుకట్టి గంతుతూంటే - అబ్బ! ఏం బాగుంటుంది?! ఆమెఅందాన్నంతా మ్రింగేద్దామనుకుంటాడతను. వెంటనే కామాక్షి చిలకలా కిలకిలా నవ్వుతుంది, ఆమె నవ్వులకీ, అతనిచేష్టలకీ విసుగెత్తి మీనాక్షి దుర్రున పారిపోతుంది. 'నవ్వుతూ నా ఆశ తీర్చుకున్నాను కాని, నీ ముద్దు చెల్లించుకో' అంటూడతను. అమ్మో! ఆమెకు కావల్సింది. అందుకే ఆమె తనసర్వస్వాన్ని అతని కర్పిస్తోంది. ఆమెకోసం

ఆమె ఎలాంటి కోరిక కోరినా అది తీర్చటానికి అతడెప్పుడూ సిద్ధంగానేవుంటాడు.

అతనికోసం తన సర్వస్వాన్ని సమర్పిస్తున్న ఆమె కోర్కె ఏ విధంగానైనా తీర్చటం అన్యాయంకాదు. కాని, అతను చేస్తున్న ఈ వృత్తి అన్యాయమనవచ్చు అందరూ. ఏమిటో? పిచ్చికాని, ప్రపంచంలో ఏవ్యక్తి నిజాయితీగా బ్రతుకుతున్నాడు. ఒకణ్ణి మరొకరు అన్యాయంగా, అక్రమంగా పీడిస్తున్నారు. ఒకరు మరొకరిపై అధికారాన్ని చెలాయిస్తున్నారు. ఒకరి క్రిందే మరొకరు బానిసల్లా బ్రతుకుతున్నారు. అందరూ ఐశ్వర్యంకోసం అర్రులు చాచేవాళ్ళే. అందినవాళ్ళు హాయిగా బ్రతుకుతున్నారు. అందనివాళ్ళు నిస్పృహ చెందుతూ, ఐశ్వర్యాన్ని పొందినవాళ్ళనిచూసి అసూయపడుతున్నారు. ఈ పోటీలో ద్వేషం పెరిగి రెచ్చిపోతున్నారు. మాటలతో మొదలైన పోటీలు, కొట్లాటలు. వరకూ సాగుతున్నాయి.

అంతేకాదు. అందాల అద్దాల మేడల్లో మెత్తని శయ్యలపై పవళించిన ఏ ఒక్కరికీ గుండె దడ పోవటం లేదు, ఎప్పుడేకీడు మూడుతుందోననే భయంతో ఒక్కరికీ కంటి మీద కునుకు పట్టదు. కటిక నేలమీద నిద్రించే ఏఒక్క గర్భ దరిద్రుడి అశాంతికీ శాంతి అంటూలేదు. ఈ రెంటికీ మధ్యరకం వాళ్లు త్రిశంకునిలా అటు ఆకాశాన్నీ అందుకోలేక ఇటు పాతాళానికీ దిగజారలేక మధ్యనే. "దొరికిందేచాలు" ననే తృప్తితో జీవితాలు కొనసాగిస్తున్నారు. ఏమిటో ఈ మానవజాతి? ఒకరిపై మరొకరికి ఈ శీత కన్నెందుకో? దీనికి అంతం ఎప్పుడో కదా? మానవుడెందుకు స్వతంత్రంగా బ్రతుకలేకపోతున్నాడు? వీరిలో ఎవరికి స్వతంత్రం వున్నట్టు? ఏ పనినీ ఏవొక్కరూ స్వతంత్రించి చెయ్యలేరు కదా!

◆ ◆ ◆

దేశానికి స్వతంత్రం వచ్చిందని అందరూ అంటే అతనూ "అవును" అనుకున్నాడు. ఏదేదో గొప్పగా చెప్తే "ఓహో" అనుకున్నాడు. కాని, జరిగిందేమిటి? స్వతంత్రం తెచ్చిందేమిటి? తరిచిచూస్తే అతనికేం కనిపించలేదు. అందుకేనేమో చాలమంది పూర్వం రోజులే బాగున్నాయంటున్నారు.

అయినా అతనికా సమస్యలతో పనిలేదు. తనకు తాను స్వతంత్రంగానే జీవిస్తున్నాడు. అదేమిటో తెల్సుకోవాలనే తనని చూడమంటాడతను. అతను ప్రయత్నమంటూ చేయాలి కాని, "ఇది-లేదు" అన్నది లేదతనికి. కావలంటే డబ్బు రాసులుగా కురిపించగలడు. అనుభవించ దల్చుకుంటే అష్టైశ్వర్యాలు అనుభ వించగలడు. అతనికి నిద్రించటానికి మెత్తని శయ్యలు అవసరంలేదు. రోడ్డు ప్రక్క చెట్టు క్రింద మైమరచి నిద్రించగలడు. అతని జీవితం మొదట్నించీ ఒక్కలాగే వుంది. ఎదుగూ, బొదుగన్నది లేదు. అతనికి కావల్సింది సుఖంగా బ్రతకటమే. అంతకంటె అతనెక్కువగా ఆశించలేదెప్పుడూ: భవిష్యత్తు కోసం అతనేం మిగల్చనక్కర్లేదు. ఆ అవసరంకూడా లేదతనికి. ఒక వేళ మిగిల్చినా కామాక్షి కోసమే.

అతనికి తెల్సు కామాక్షి డబ్బుకోసమే బ్రతుకుచున్నదని. అంచేత తన అనంతరం కామాక్షి మరొకర్ని ఆకర్షింప జేసుకోవచ్చు. వాడూ తనలాగే ఆమెకోసం ధనాన్ని అర్పించవచ్చు. అలా, అందరి దగ్గరా సంపాయించింది కామాక్షి అనంతరం ఎవరికి చెందుతుంది? ఏమో, ఎవరికి తెల్సు? ఎవరికో పోయేదానికి, అతనెందుకు సంపాయించాలి? అదీ అతనికున్న ప్రశ్న.

కలిగింది, అనుభవించలేక ఎవరికోసమో దాచిపెట్టడం మానవుని మూర్ఖత్వాన్ని తెలియజేస్తుంది. "సంపాయించు, అనుభవించు" అదేఅతని మతం. అందుకోసమే అతను ఈ వృత్తిని స్వీకరించాడు.

తృప్తిగా మరొకసారి కత్తెరను పరికించి చూసాడు. కత్తెర మధ్య ఎన్నో జేబుల స్వంతదార్ల కంఠాల ఆక్రందనలు వినిపించాయతనికి. అతని శరీరం గగుర్పాటు చెందింది. ఎందరిజేబులు కత్తిరించేడతను! ఎందరి మగువల కంఠాలనుండి ఆభరణాలను అవలీలగా కాజేసేడు తను! "తను సంపాయించిదంతా ఎక్కడుంది?" అనుకున్నాడతను.

ఎవరెవరికి ఎంతెంత యిచ్చిందీ అతనికి తెలుసు. అక్షర జ్ఞానం లేక పోయినా, ప్రపంచాన్ని బాగా అర్థం చేసుకున్నాడు. తన నైపుణ్యానికి, శక్తికి తనకు తానే ఆశ్చర్య పోతాడు.

నమ్మినబంటులా తన ఆజ్ఞల్ని శిరసావహిస్తున్న కత్తెరను తనివితీరా ముద్దుపెట్టుకున్నాడు. కత్తెర మెరుగులో ప్రతిబింబం కనిపించింది. కాని, అది అతనిదికాదు. అతని అందాలరాణిది! కామాక్షిది! కిలకిలా నవ్వుతు కనిపించింది. తన రాకకోసం ఎదురుచూస్తోందట. 'నా కోర్కెను తీర్చి నీ ఆనందాన్ని పొందు' అంటున్నది. అబ్బ! ఆ నవ్వులో ఆ ముఖం ఎంత అందంగా వుంది; ఆ మాటల్లో ఎంత అమాయకత వుంది! ఆ పెదవుల్లో ఎంత తియ్యదనంవుంది? అవన్నీ అతనే కొల్లగొంటున్నాడు. అందుకోసమే అతను పుట్టింది. అతనికోసమే ఆమె జన్మించింది. అతనినే నమ్ముకొనివుంది. ఆమె కోసమే అతను ఈ తపన పడుతున్నది. అతను లేకపోతే ఆమెలేదు. ఆమె లేకపోతే అతను లేదు. అంచేత మరుచటిరోజు కామాక్షింటికి వెళ్ళేటప్పుడు ఆమెకోర్కె తప్పక తీర్చాలని నిశ్చయించుకున్నాడు.

ఆ మెరుగులో కామాక్షి బింబాన్నిచూస్తూ 'నీ కోర్కె తప్పకుండా తీరుస్తాలే' అన్నాడు మెల్లగా.

తిరిగి కత్తెరమధ్య ఆక్రందనలు వినిపించాయి. ఒక ప్రక్క ఆనందం, మరొకప్రక్క ఆహాకారాలు. రెండు దృశ్యాలు ఒకదానికొకటి భిన్నంగా వున్నాయి. తిరిగి మరొకసారి తీక్షణంగాచూసేడు. రెంటికీమధ్య తీవ్రంగా సంఘర్షణ జరుగుతోంది. భయంకర సంగ్రామం. దవానలం పుడుతోంది. ఎందుకో అతనికి నవ్వొచ్చింది. నవ్వుకున్నాడు. 'సంఘటనల సంఘర్షణే మానవజీవితం. కొందరికి జయం. మరికొందరికి పరాజయం తప్పదు' అనుకున్నాడు స్వగతంగా.

కాని, అతనింతవరకూ పరాజయాన్ని రుచిచూడలేదు. అలాంటి పరిస్థితులు రావని అతనికి దృఢవిశ్వాసం. ఎందుచేతనంటే, ఎవర్నీ ఇంతవరకూ అన్యాయం చెయలేదంటాడతను. జీవితాల విలువల్ని తెల్సుకోలేని వాళ్లెంవరో తనపని అధర్మమైనదంటారని అతని వాదన, పైగా ఎదురుప్రశ్నలుకూడా వేస్తాడు.

మృగరాజూ, జంతువుల పరిరక్షకుడూ అయిన సింహం తన ఆకలిని తీర్చుకోటానికి, అమాయకురాలైన లేడిపిల్లను చంపితింటే అన్యాయం, అధర్మంకాదా? అయినా, అన్యాయం కాదంటాడంతా. మరయితే, తన బ్రతుకుకోసం, తన ఆనందంకోసం జేబులుకత్తిరించటం ఎందుకు అన్యాయమౌతుంది?

♦ ♦ ♦

ధనం ఏ ఒక్కడి సొత్తుకాదు. అదెప్పుడూ చేతులు మారుతూ వుండాల్సిందే. అందుకే లక్ష్మి ఎప్పుడూ ఒకచోట నిలవదంటారు. ఆమె పయనానికి వాహనంవంటివాడతను. అన్యాయంగా ఆర్జించింది. బంగారంగా మార్చి, మెడలను ఆభరణాలరూపంలో అలంకరించుకొని, పరులచూపుల్ని ఆకర్షించుతూ, తమకంటె తక్కువవాళ్లని అహంకారంతో హీనంగా జూస్తూన్న వాళ్లకి తగిన ప్రాయశ్చిత్తమే చేస్తున్నానంటాడతను. ఎంతోమందిళ్ళల్లోని చీకటిగదుల్లో, ఇనప్పెట్టల్లో, గాలీ వెలుతురూ చొరబడక ఎన్నెన్నో నోట్లకట్టలు మ్రగ్గిమూలుగుతున్నాయి. వాటికి అతను స్వేచ్ఛను ప్రసాదిస్తున్నాడు. అలాచేయటం తప్పని ఎవరనగలరు? అంటే అనవచ్చు. కాని, అతనుమాత్రం తన ధర్మం నిర్వహిస్తున్నానని అంటాడు,

అతను ఇంతవరకూ తన కర్తవ్యాన్ని నిర్వహిస్తున్నది ముఖ్యంగా మూడు స్తలాల్లో దేవాలయలదగ్గర; సినిమాల దగ్గర; రద్దీగావున్న బస్సుల్లో.

ఈ లోకంలో చేసేపాపాలకు ఈలోకంలోనే ప్రాశ్చితం అవుతుందని, దైవమే వేరొక రూపంలో ఆ పని కాస్తా జరిపిస్తాడని, ఆనాడు గుళ్లో ఒక స్వాములు వారు చెప్పటం అతను చెవులార విన్నాడు. అంచేత తనూ దైవమేనంటాడతను. కాకపోతే, కనీసం దైవాంశసంభూతుడేనా కావాలి. అన్యాయంగా ఆర్జిస్తున్న మనుషుల్ని పట్టపగలు గుంజుకుంటున్నాడు. ఇంత పబ్లిక్ గా తన పని తాను చేసుకుపోతున్నా ఒక్కరూ అతన్ని గమనించటం లేదేం? ఎలా చూడగలరు? పాపాత్ముల కళ్లెప్పుడు పైర్లు కమ్మేవుంటాయి.

అణా ఖరీదు సిగరెట్టుకొని, సగం కాల్చి మిగతాది గొప్పకోసం పారేస్తారు మనుష్యులు. వాళ్లకు డబ్బు విలువ ఎందుకు తెలియదో "బాబు ఒక్క పైసా ధర్మం చెయ్యండి" అని పక్కనే అనాథల ఆక్రందనలకు వాళ్లహృదయాలు ద్రవించవు. వాళ్లవి పాషాణ హృదయాలనటంలో సందేహంలేదు. తమ విలాసాలను కొంచం తగ్గించుకొని తోటి మానవులకోసం ఎందుకు త్యాగం చెయ్యకూడదు?

(సశేషం)

# పరాజితుడు

రచన:
శ్రీ ఏ. ఎస్. రామారావు

(గతసంచిక తరువాయి)

అతడు అడిగిన వాళ్ళకెప్పుడు లేదనలేదు. సంపాయించిందంతా అతనొక్కడే ఎప్పుడూ అనుభంచలేదు. వీలయినప్పుడల్లా డబ్బున్న వాళ్ళని దోచుకుంటూ, లేని వాళ్ళకు సహాయం చేస్తున్నాడు. అంచేత అతను చేస్తున్న పని ఎన్నటికీ అన్యాయముకాదు; అధర్మముకాదు.

తిరిగి కత్తెరలోకి చూసేడు. అంతా ఆక్రంధనలు వినిపిస్తూనే వున్నాయి. 'ఏడవండి; ఇంకా ఏడవండి. ఎందర్నో ఏడిపించిన మీరు ఎంత ఏడ్చినా పాపం తీరదు' ఈసారి అతని మాటలు అస్పష్టంగా అన్నాడు.

కామాక్షి కల కల లాడుతూ మళ్లా కనిపించింది. ఈసారి ఒక్కతేకాదు, మీనాక్షితోసహా. ఒక్కసారిగా అతనిలోని కోపమంతా చల్లారి పోయింది.

మీనాక్షి ఎంత అందంగా వుంది! అతనుచూస్తుండగానే గౌన్లు; పరికిణీలు తొడిగింది. ఎంతలోనే ఎంతమార్పు! ముఖ్యంగా ఆడదానిలో ఈ మార్పు ఎంత త్వరగా వస్తుంది. వయస్సుకు తగ్గట్టుగా, అవయవాలన్నీ ఎంచక్కగా, పొందికగా అమర్చి వున్నాయి. మీనాక్షి నవయౌవ్వన కుసుమం. అనాఘ్రాణిత పుష్పం. ఆమెలో అంత అందం ఎలా పుట్టి పడిందో!

సరిగా కామాక్షిని అదే వయస్సులో అతను చూసేడు. చూడగానే మనిసిచ్చాడు. కామాక్షి అతనిదై పోయింది. అతను కామాక్షివాడై పోయేడు. సంవత్సరాలకు సంవత్సరాలు దొర్లి పోయినా, కామాక్షిలో మార్పేంరాలేదు. విచిత్రమేమరి! ఇక మీనాక్షిని కూడ తనదానిగా చేసుకోవాలనుకున్నాడతను. ఇరుప్రక్కల కామాక్షి, మీనాక్షి. అంతే అంతకంటె అతనికేం అక్కర్లేదు.

అతని హృదయం పులకించింది. రక్తం వుడుకెత్తింది. అద్దంలా మెరుస్తున్న కత్తెరలో ఆ ప్రతిబింబంలా వూహించుకుంటూ ముద్దు పెట్టుకోబోయేడు.

కత్తెర మెరుపు మనసులో ఏదో 'షాక్' కొట్టినట్లయింది. కామాక్షి గత రాత్రి కోరిన వరం జ్ఞప్తికి వచ్చింది.

అతనూ, కామాక్షి కలిసి క్రితంరోజు సినిమాకు వెళ్లేరు. తమముందు కుర్చీలో ఇద్దరు యువతీ యువకులు కూర్చున్నారు. వాళ్లని చూస్తే ముచ్చటనిపింది. వాళ్ల సంభాషణల్ని బట్టి చూస్తే క్రొత్తగా పెళ్లయిన జంటని ఇట్టే తెలిసింది. అతనికి కామాక్షి ఆయమ్మాయిని చూపించింది అతనూ చూసేడు. అచ్చంగా మీనాక్షిలా వుంది. అదేమాట అతను అన్నాడు. కాని, కామాక్షి చూపించిరి, ఆయమ్మాయిని కాదు. ఆమె మెడలో చంద్రహారాన్ని ఆఅమ్మాయి అలంకరించుకుంటే ఎంతో అదంగా వుంది.

అలాటి హారం అతను మీనాక్షికివ్వాలట!

అతనేదో అనుకున్నాడు, ఎంత చిన్నకోరిక కోరింది అతని కిదొక లెఖ్ఖా? కావలంటే అలాటి హారాలు కొల్లలు కురిపించగలడు. 'సరే' అని మాట యిచ్చేడు. ఇచ్చినమాట త్రోసి పుచ్చటం అతని జన్మలోలేదు.

అతనికి తెల్సు ఆ అమ్మాయి ఎవరో. ఆబస్సులో కాలేజికి వెళ్తుండటం ఎన్నో సార్లు చూసేడు. ఆ హారం మీద అతనికళ్లు ఎన్నిమార్లో పడ్డాయి. కాని, ఆ అమ్మాయిలోని అమాయకత్వం; ఆమెలో మీనాక్షి రూపం కనిపించటంతో అతను ప్రయత్నాలను విరమించుకున్నాడు. కాని, అతనిపుడు ఆ హారాన్ని కాజేయక తప్పని సరైంది. తనకామాక్షి కోసం తప్పక చెయ్యాలి. వాళ్ల ఆనందమే అతనికానందం. అంచేత ఆ చంద్రహారాన్ని కాజెయ్యటానికి నిశ్చయించుకున్నాడు. అతని నిశ్చయానికి కామాక్షి, మీనాక్షి కలిసి నవ్వినట్లనిపించిందతనికి. తృప్తిగా కళ్లు మూసుకున్నాడు. కంటిమీద కునుకు పట్టింది.

♦ ♦ ♦

జనంతో రోడ్డంతా రద్దీగా వుంది. అదే బస్టాపు అక్కడే రోజు ఆ అమ్మాయి బస్సెక్కేది. అంచేత ఆమె రాకకోసం నిరీక్షిస్తూ అతను అక్కడే నిల్చున్నాడు. ఎన్నో బస్సులు వచ్చి వెళ్తున్నాయి. ఎందరో మనుషులు ఎక్కి దిగుతున్నారు. కాని, అతను మాత్రం అక్కడే నిల్చున్నాడు.

అదుగో! ఆ అమ్మాయి వచ్చింది. బస్సుకూడా వచ్చింది. బస్సుచాలరద్దీగా వుంది. ఆ అమ్మాయి జనాన్ని త్రోసుకుంటూ బస్సు ఎక్కుతోంది. ఆమె వెనకాలే అతనూ ఎక్కాడు. బస్సుకండక్టరు 'రైట్' అన్నాడు. అతను కత్తెరకు 'రైట్' అన్నాడు. బస్ 'స్టార్టు' అయింది. అతను 'స్టాపు' అయ్యాడు. ఆ అమ్మాయి బస్సులో వెళ్ళిపోయింది. ఆమె మెడలోని చంద్ర హారము అతని చేతిలో వుండి పోయింది.

ఎప్పుడూ లేనిది ఈరోజు ఎందుకో అతనిగుండె వేగంగా కొట్టుకుంది. శరీరం కంపరమెత్తింది. భయం వేసి చుట్టూ చూసేడు. విపరీతమేమీ జరగనందుకు కాస్త స్థిమిత పడ్డాడు త్వరగా ఇల్లు చేరుకున్నాడు. కామాక్షి కోర్కను తీర్చగలిగినందుకు సంతృప్తి చెందేడు.

నెమ్మదిగా జేబులో చంద్రహారం తీసేడు. చాలా విలువ చేస్తుంది. ఎంత చక్కటి పనితనం! ప్రత్యేకించి ఆ అమ్మాయి కంఠానికి సరిపోయేట్టు ఎంత చక్కగా చేసేడు పనివాడు! ఈ హారం వేసుకుంటే మీనాక్షి మరీ రాణిస్తుంది. తన నైపుణ్యానికి మీనాక్షి తనదై పోతుందనటంలో ఎలాటి సందేహం లేదనుకున్నాడు అతను.

◆ ◆ ◆

చంద్రహారం మధ్య వ్రేలాడుతూ మంగళసూత్రం ఇంకా క్రొత్తగానేవుంది. దానికి కట్టిన పసుపురాసిన సూత్రాలు ఇంకా అలానే వున్నాయి. మంగళ సూత్రాల్ని పరీక్షించి చూసేడు. అదిపెట్టెల్లావున్నాయి. పైమూతవిప్పి చూసేడు. ఆ రోజు అతను సినిమాలో చూసిన అబ్బాయి ఫోటోతోసహా వుంది. వాళ్ల చిరునామాకూడా వ్రాసివుంది. ఆ అబ్బాయి, ఆమె భర్తేనని అతనారోజు అనుకున్నది యదార్థమే ననుకున్నాడు. తిరిగి ఎప్పటిలా మూత వేసాడు. తృప్తిగా మరొకసారి నవ్వుకున్నాడు ఆ హారాన్ని అందులో మంగళసూత్రాన్ని చూసి. కాని, మంగళసూత్రంనుండి అమంగళస్వరం వినిపించినట్లయిందతనికి.

మంగళసూత్రాన్ని వింతగా చూసేడు. అందులో ఆ అమ్మాయి కనిపించిందతనికి. కాని, ఈసారి ఆమెరూపు మారిపోయింది. ముఖంలో ఆ నవ్వులేదు. అమాయకత లేదు. నుదుట కుంకుమలేదు. రంగురంగు అంచుల పువ్వుల చీర కట్టలేదు. వదులుగా నల్లని పొడుగాటి శిరోజాల్ని ముడివేసుకుంది. వాటికి తైల సంస్కారం వున్నట్టులేదు. ఒంటిమీద ఆభరణాలు అంతకన్నా లేవు,

కొద్ది క్షణాలుక్రితం అతను చూసిన అమ్మాయి రూపుకూ, ఈమె రూపుకూ ఎంతో వ్యత్యాసంవుంది. ఏదో విలువైన, ప్రాణప్రదమైన వస్తువును పోగొట్టుకున్నట్టు వెక్కి వెక్కి ఏడుస్తోంది. నేలకు తలని కొట్టుకుంటూ విలపిస్తూంది. అంత అందమైనదీ ఎంతో అనాకారిగా మారిపోయింది.

ఎందుకలా జరిగిందో అతనికేం అర్థంకాలేదు. మీనాక్షే ఆరూపంలో అతనికి సాత్కారించినట్లనిపించింది. ఆ రూపంలో, అతను మీనాక్షినే చూసేడు. అతని మనస్సు కలవరపడింది. తనేదో ఘోరంచేసినట్లు బాధపడ్డాడతను.

ఆ అమ్మాయిలో అంత త్వరగా రూపుమారిపోవటానికి కారణం అతను ఇట్టే తెల్సుకున్నాడు. ఆ అమ్మాయి మాంగళ్యాన్ని పోగొట్టుకోగానే అమంగళమైంది. అమంగళం కావడానికి తనే కారణం అనుకున్నాడు. ఆమెకు తీరనిద్రోహం చేసినట్లనిపించిందతనికి. ఆమె ఆశా సౌధాలకు పునాదులతో సహా నేలమట్టంచేసేడు. ఈ పరిస్థితులే మీనాక్షిని ఎదుర్కొంటే తను సహించేవాడా? తనకు తాను ప్రశ్నించుకున్నాడు. ఆ పరిస్థితులు తెచ్చినవాణ్ణి నామరూపాలులేకుండా చేసేవాడు. జవాబు చెప్పుకున్నాడు. మరి, ఆ అమ్మాయి ఎవరితో చెప్పుకుంటుంది? ఏమని చెప్తుంది? తన మీనాక్షికోసం, మరొకరి మాంగళ్యాన్ని అపహరించేడు. స్త్రీ తన పవిత్రత కోసం దేన్ని ప్రాణసమానంగా పరిరక్షించుకుంటూంటుందో దాన్నే కాజేసేడు. జీవితపు విలువల్ని తారుమారు చేసేడు. తన కామాక్షికాని, మీనాక్షికాని ఆ రూపంలో సాక్షాత్కరిస్తే చూడగలిగేవాడా? 'కేవలం భౌతిక వాంఛలకోసం ఎంతటి ఘోరకృత్యాలకి సిద్ధపడ్డాడు తను' అనుకున్నాడతను.

ఆనాడు అతనికి కామాక్షి కనిపించక పోతే అతనిలా మారేవాడుకాదు. కామాక్షి కోసం అతను ఈ

వృత్తి చేపట్టాల్సి వచ్చింది, ఆడదాంలో ఆశలు ఎంతెంత పరిణామాలనీ, పరిస్థితుల్నీ తెచ్చిపెడతాయి! అసలు కామాక్షి ఎవరు? ఏమో! అతనికేం తెల్సు! అయినా అతనిని ఆకర్షించింది. అతను మనసిచ్చేడు. ఆ 'ఎవరి' కోసమో. అతను 'ఎవరెవరివో' బ్రతుకులు ఇన్నాళ్లూ నాశనంచేసేడు. 'ఛీ! ఇదీ ఒక బ్రతుకేనా?' ఎంతగా తపన మయ్యావు!' అంతరాత్మ దూషించినట్లనిపించింది. అతని మనస్సు బాధపడింది. అతని హృదయంలో పరివర్తన కలిగింది.

♦ ♦ ♦

'తనకెవరున్నారని? తనెవరికోసం బ్రతికినన్నాళ్లిలా బ్రతికాను, ఇలా ఇక బ్రతక్కూడదు. తనకీలోకంలో మరి స్థానంలేదు. తనలాటి వాళ్లెందరున్నారో కదా ఈ లోకంలో! ఎవరూ లోకాన్ని బాగుచేయటానికి నడుం బిగించరేం? అంతా తనలాంటివాళ్లే నేమో? అయినా తనపిచ్చగాని, లోకాన్నంతటినీ ఎవడో ఒక్కడు బాగు చేయగలడా? ఎవరికి వారు బాగుపడితే లోకం దానంతట అదే బాగుపడుతుంది. ఛీ ఎందరిజీవితాల్ని నాశనం చేసేనో కదా!'

'తను చేసిన పాపానికి ప్రాయశ్చిత్తం లేదు, క్షమార్హుడుకూడా కాదు, పశ్చాత్తాపం చెందినవాడికి, తనలాంటివాడికి హక్కులేదు. తనని ఖండఖండాలుగా కోసినాకూడా తనుచేసిన పాపానికి పరిహారంలేదు. ఈ హారాన్ని ఆ అమ్మాయికిచ్చేస్తాను. మాంగళ్యాన్ని నిలుపుతాను. తనని నిలువునా నాశనంచెయ్యమని ప్రాధేయపడతాను. ఆమె అంగీకరించకపోతే నాకై నేను పోలీసులవశం అవుతాను. నన్ను నాశనంచెయ్యమని ప్రార్థిస్తాను. వారు కాదంటే, నన్ను నేను నాశనం చేసుకుంటాను, అంతకంటె శరణ్యంలేదు. అప్పుడే నాకు మనశ్శాంతి' అనుకున్నాడతను. వెంటనే రోడ్డుమీద పరుగెత్తసాగేడు.

'నేను దొంగని! జేబు దొంగని! పట్టుకోండి! చంపండి! నాశనం చెయ్యండి' అంటూ అరుస్తూ ఒకచేత్తో చంద్రహారాన్ని, మరొకచేతిలో కత్తెరతో పోలీసుస్టేషనులోకి పరుగెత్తేడు.

అతణ్ణి చూసిన జనానికి ఏం అర్థంకాలేదు. అందరూ అతణ్ణి వెంబడించేరు. పోలీసుస్టేషను జనంతో కిటకిటలాడింది.

'కథాంజలి'
[చక్కని కథల మాసపత్రిక]
స్థాపితం. 1938.

విడి ప్రతి — 25 న. పై.
సంవత్సర చందా 4-0-0.
(ప్రత్యేక సంచికలతో సహా.)

అన్ని హిగిన్ బాథమ్స్ బుక్ స్టాలులోనూ దొరకును.

